# హరేరామ హరేకృష్ణ హరేహరే-స్త్రీలు

నందివాడ భీమారావు

రంగధామ రావుగారి వయస్సు ఇరవైకాదు ముప్పై కాదు, నలభై కూడా కాదు. నలభై అయిదు దగ్గిరకొంచెం మొహమాటపడాల్సొస్తుంది. ఆయనింకా ఉద్యోగంలోనే ఉన్నారు కనకా ఇప్పట్లో రిటైరై పోయే వాడికుండే బెంగ లక్షణాలేం కనపడవు కనుకా లోతుగా ఆరాతీసి వయస్సు కనుక్కునే అవకాశం నాకెప్పుడూ కలుగలేదు. ఆయన ఒక్కోప్పుడు బలే సరదాగా కబుర్లు చెప్పి నవ్విస్తుంటారు మళ్ళీ ఒక్కోసారి పర్సుపోయిన వాడిలా ముఖం పెట్టుకుని ఏదైనా మాట్లాడించినా కూడా ఊఁ అఁ తప్పించి నోరెత్తరు. ఇంతకీ మా పరిచయం బస్సులో. ఆఫీసుకు వెళ్ళేప్పుడు నాకంటే రెండు స్టాపుల తర్వాత ఎక్కుతాడు. తిరిగొచ్చేప్పుడు అలాగే ముందు దిగుతాడు. ఆయన అప్పుడప్పుడు ఆహ్వానించినా ఎప్పుడూ వాళ్ళిల్లెక్కడో సరిగా కనుక్కుని వెళ్ళేతీరిక, పోనీ ఆయన్నే ఓ మాటు మా రూముకి రమ్మనే తీరువు కూడా లేకపోయాయి నాకు. అందుకని ఆయన సంసార వ్యవహారాలు, పిల్లలెందరో, ఆడో మగో—ఏం చేస్తున్నారో పెళ్ళిళ్ళయాయో వగైరా సంగతులేమీ నాకు బొత్తిగా తెలియవు. ఆయనతో పరిచయమై ఏడాది కావస్తున్నాను. పెళ్ళికొడుకు తండ్రుల్ని కట్నాల రాబందులుగా చిత్రించి ఆవేశంతో మాట్లాడిన సందర్భాలు దొర్లేవి- అయితే తను స్వయంగా ఆ బాధ పడ్డానని ఆయన ఎప్పుడూ అనలేదు: ఒక్కొక్కప్పుడు ఈయన నాలో పెళ్ళికొడుకు వాసనలేవన్నా చూసి కొంచెం కలుపుగోలుగా ఉంటున్నాడా అని అనుమానం వచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు. కాని ఆ అనుమానికి కార్యరూపమైన నిదర్శనం ఏదీ ఎప్పుడూ దొరకలేదు.

రంగధామరావుగారు రోజూసాయంత్రం మేం బస్సులో కలిసి వెళ్ళే ఇరవై నిమిషాల్లోనూ ఏదోమిష కల్పించుకుని వాదం పెంచి కాలక్షేపం చేస్తారు. మంచి మూడ్‌లో ఉన్నరోజుల్లో రకరకాల విషయాల్ని గురించి తన అభిప్రాయాల్ని వెల్లడిస్తూ ఉంటారు. అందరూ ఇంచుమించుగా అవుననే విషయాన్ని కాదనడం ఆయన హాబీ. "చెడ్డతనం నన్నాట్టే బాధపెట్టదోయ్. మంచితనం లేకపోడమే నే తట్టుకోలేను ఎప్పటికీను" అని ఆయన ఒకటికి రెండు సార్లనడం విన్నాను. "లాభనష్టాలు బేరీజు వేసుకుని మన కవసరం ఎవళ్ళతో ఉంటుందో వాళ్ళకే చేసే మంచి మంచెల్లా అవుతుందోయ్" అంటాడు. ఎవరేనా కుర్రాడు వయసులో ఉన్న అమ్మాయికి లేచి సీటిస్తే "ఇదో వేషం. నిజంగా షివల్రీఅయితే ఇందాక ఆ పెద్దావిడొచ్చినప్పుడు లేచాడూ? ఇలా రెండురోజులు సీటిచ్చి తరవాత వెనక్కాల పడి వెకిలి వేషాలేయ్యడా లేగాని" అంటాడు. ఆదేమళ్ళీ ఇంకోమాటు సీటివ్వకుండా ధిణాయించి కూచుంటే తను కూడా లేవకుండానే "ఈ రోజులలో షివల్రీ బొత్తిగా చచ్చిపోయింది. పైగా ఏమైనా అంటే మీ రెందుకు లేవకూడదని మా బోటి ముసలాళ్ళనే నాలుగంటారు. అసలింతకీ మనుష్యులు మనుషులుగా ఉండే రోజులు వెళ్ళి పోయాయి, మగసిరి నశించిన మనుష్యులేం చేస్తారింక" అంటాడు. ఆడా మగా క్రిక్కిరిసి ఉన్న బస్సులో "అసలీ ఆడాళ్ళని ఈ బండ చదువులు చదివి ఉద్యోగాలు చేసి ఉళ్ళేలమని ఎవడన్నాడంట? ఇంక స్త్రీత్వంఅంటూ వీళ్ళలో ఏం మిగులుతుంది? ఈ ఆడామగా జాతి భేదం వల్లొచ్చే సమస్యలన్నిటికీ చక్కటి హాయైన పరిష్కారం సాంప్రదాయకమైన శ్రమపంపక విధానమే. అంతేగాని వాళ్ళేమేం చేస్తే మేమూ అవేచేస్తాం అని ప్రారంభించడం నిరర్థకం." అని పెద్ద లెక్చరు ప్రారంభిస్తాడు బస్సు మిస్సయిన రోజున "ఆమొచ్చిందాకా అమావాస్య ఆగుతుందా? మరి అందుకనే మనవాళ్ళు నాగుల చవితికీ, కార్తీకపౌర్ణమికీ దీపాల

సంబరం వాటా పెట్టారు. అలాగే మనలాంటి వాళ్ళకో లేటు, బస్సుప్రసాదించారు" అని చమత్కరిస్తాడు.

రంగధామరావు గారు సింపుల్‌గా ఉంటాడు. ఆయన కాటన్‌పేంటు, బుష్‌షర్టులో ప్రత్యేకతేం లేదు. కనీసం చిరుగులు కనబడుతూ కూడా ఉండవు: ఇతనేదో ఘోర దరిద్రావస్థలో ఉన్నాడని ఊహించుకు కథలు రాసేందుకు. అతను పెట్టుకునే కళ్ళజోళ్ళో, కాళ్ళకి వేసుకునే కాబూలీ చెప్పులలో, తలమీద పలచటి జుట్టులో చామనచాయ శరీరంలో, గుండ్రని మొగంలో చెప్పుకోదగ్గ ప్రత్యేక తేమీలేదు. సాధారణంగా ఇలా కథలలోకి చొచ్చుకొచ్చే వాళ్ళకి కళ్ళల్లో బోలెడు, మాటలలో చెప్పడానికి వీల్లేని ప్రత్యేక ఆకర్షణుంటుంది. ఈయనికి అదీలేదు, మరెందు కతన్ని గురించీ సోదెంతాను. అంటే నేను చెప్పగలిగింది ఒక్కటే. అది అతని వ్యక్తిత్వం, మనుష్యుల్ని కాస్త గమనించి వాళ్ళని గురించి ఏదో ఊహించుకుని కాలక్షేపం చేసే వాళ్ళని రావుగారు తప్పక ఆకర్షిస్తాడు. ఆయన మాటతీరుసంగతి చెప్పానుగా చాలాహాయిగా మాట్లాడ తాడని, మంచిమూడ్స్‌లో ఉన్నప్పుడు.

ప్రొద్దున్న ఆఫీసులకి వెళ్ళేటప్పుడు మేం ఒకే బస్సులో వెళ్ళినా ఒకే చోట కూర్చోం. వేరువేరు చోట్ల ఎక్కుతాం గనక. ఒకనాడు బస్సులో కొంచెం దూరంనించే రావుగార్ని చూశాను. అతనికి దగ్గర సీటులో ఒకావిడ కూర్చునుంది. వయస్సు ముప్పై, ముప్పై అయిదు మధ్య నుంటుంది, ముఖంలో పెద్ద ఆకర్షణలేక పోయినా బాగులేదనడానికి లేదు. కాని ఏదోవెలితి కనబడింది. ఏళ్ళతరబడి ఆఫీసులలో పని చేసి సహజమైన మార్దవం కొంతవరకు పోగొట్టుకున్నట్టు కనిపించింది. ఆవిడ సీటులో చివరని బైటికి చూస్తుకూర్చుంది. ఆ సమయంలో రంగధామరావు గారి కళ్ళు నిమిషంలో నలభై సెకన్ల కాలం ఆవిడ మీదనే నిలుస్తున్నాయి ఆమెని చూస్తున్నంత సేపు అతని మోహంలో పోయిన పర్సు తిరిగి దొరికిన కళ తారట్లాడింది. ఆమె ఈయన ఉనికినే గమనించి నట్లు లేదు. మరిబొత్తిగా అంత తెలియని వాళ్ళయితే ఆయనలో ఆ మార్పే మిటో నాకర్థం కాలేదు. పోనీఏదో ఆడదాన్ని చూస్తే కలిగే వికారమేమో ననుకుంటే, ఆ బస్సునిండా ఆవిడకంటే ఎన్నోరెట్లు ఆకర్షణలతో ఆడవాళ్ళు చాలామందున్నారు. అంతేగాదు రోజూ అలా ఆడవాళ్ళతో నిండినబస్సుల్లో ప్రయాణంచేస్తున్నా ఆయనలో ఏ విధమైన రియాక్షనూ చూడలేదు. మనిషికూడా చిన్నవాడుకాదు. ఒకవేళ ఎలాంటి భావాలు కలిగినా వెకిలిగా బైటపడే రకంగాదు. జీవితం అనేక రకాలుగా చూసినవాడు.

ఈ ఘట్టం ఆ రోజుకు మేం ఆఫీసులకి దగ్గరదిగటం బస్సు ఆవిడని తీసుకొని ముందుకు పోవడంతో అయిపోయిందను కున్నాను; కానిమళ్ళీ వారం రోజుల తర్వాత ఆవిణ్ణి బస్సులో చూశాను. అలాగే నిర్లిప్తతతో, మరొకళ్ళ ప్రమేయం లేకుండా కూర్చునుంది. ఒకమాటు పరకాయించి చూస్తే దగ్గర్లోనే రంగధామరావు బస్సులో పై ఊచపట్టుకుని ఆవిడ కేసే చూస్తూ నిలుచుని ఉన్నాడు. నాకాశ్చర్యం మేసిందేవిటంటే కాస్త దృష్టినిలిపిచూసినా కనబడేంతదూరంలో నేనున్నా, అతని దృష్టి ఒకటి రెండు మార్లు ఆవర్తులంతిరిగినా, అతను నన్ను గమనించినట్టేలేదు. మామూలుగా అయితే ఇద్దరం బస్సు రెండుచివర్లా ఉన్నా కనబడగానే ఒకమాటు సైలెంటు గ్రీటింగ్ చేసుకోకుండా ఉండలేదు.

ఈ కథ ఈవిధంగా మళ్ళీమళ్ళీజరుగుతూ వచ్చింది. ఆయన్నే డైరక్టుగా ఏమిటి సంగతి అని అడిగేంత ధైర్యం, చనువూ నాకు లేక పోయాయి. అందుకని నాలోనేనే ఏవో ఏవో సిద్ధాంతాలు ప్రతిపాదించు కున్నాను. ఆవిడ బాగాచిన్న పిల్లప్పుడు వాళ్ళయిళ్ళు దగ్గిరఉండిఉంటాయి. బాగా ఎత్తుకుని ఆడిస్తూ ఉండేవాడేమో, ఇతను పెద్దయ్యాక కూడా ఆమెని గుర్తుపట్టి ఉండచ్చు, పెద్దయ్యాక పరిచయం లేక ఆవిడకి ఇతన్ని గూర్చితెలియక పోవచ్చు, చిన్నప్పటి ఆప్యాయత అతనిలో అలామిగిలి పోయిందేమో, లేకపోతే ఇతనికెవరైనా చనిపోయిన చెల్లెలివో కూతురివో పోలికలు ఆమెలో కనిపించిఉండచ్చు, తన్నికాదని బోల్డుకట్నంతోసహా పట్నంలో ఉద్యోగస్తుణ్ణి పెళ్ళాడిన చిన్నప్పటి ప్రేయసి పెద్దయి, ఇలాఉంటుందని అనిపించుండొచ్చు. కాని ఆమెమోహంలో మాజీప్రేయసి మీదుండే కసేం కనబడేది కాదు. ఇలా ఎన్నోరకాలు ఊహలు

కలిగేవి అన్నీ పత్రికల్లో కథల్నించిగాని నా సొంత ఊహలుగా భ్రమపెట్టినవే ననుకోండి. ఎందుకంటే అప్పటికి నేను ఈ వ్యవహారాల్లో బొత్తిగా పత్రికా మాత్రజ్ఞానుణ్ణి.

ఆవిడ రంగంలో కొచ్చినతర్వాత రంగధామరావు గారి ఛలోక్తులూ వాగ్వివాదాలూ కొంచెం తగ్గాయి ఆఫీసుకు వెళ్లే సమయంలో సాధారణంగా ఆవిడకోసం వెతుకుతూ ఉంటాయి కళ్లు ఏవారానికో పదిరోజులకో ఓసారి ఆవిడ కనబడుతుంది. రిటర్న్ జర్నీలో ఎప్పుడూ ఆవిడ తగల్లేదు. ఆవిడకి పనిముగించే సమయం కొంచెముందో తరువాతనో ఆయుండాలి మేమిద్దరంమాత్రం మామూలుగా కలిసికూచుని వచ్చేవాళ్ళం. అతని ధోరణిలో స్పష్టం గాకుండా మార్పులు రావటం మొదలెట్టాయి — ఇదివరకులా ప్రతిదానిలోనూ మంచీ చెడూ అంటూ analyse చెయ్యటం తగ్గింది. ఆడవాళ్ళు ఉద్యోగం చెయ్యటం అంటే ఉన్న ఎలర్జీ కొంచెం దిగజారింది.

ఇలా ఉండగా ఒకరోజున బస్సులో రుసరుసలాడుతూ పర్సే కాకుండా రైలు టిక్కెట్టూ. తాళం చెవులూ కూడా పారేసుకున్న మొహంతో కూర్చున్నాడు. ఆరోజు ప్రొద్దున్న నేను మామూలుగా వెళ్ళే బస్సులో వెళ్ళలేదు. అందుకని ఏం జరిగిందీ నాకు అంతు చిక్కలేదు ఆలాఉండడానికి లక్షకారణాలుండచ్చు. కాని నాకు మట్టుకు బస్సులో ఒచ్చేప్పుడు జరిగిందేదో, ఆమార్పుకి కారణమని నమ్మకంగా అనిపించింది. "ఏవిటి రావుగారు ఇవాళ కొంచెం చిరాగ్గా ఉన్నట్లున్నారు" అనిపలుకరించాను. "ఏం లేదోయ్ కొంచెం తల నెప్పిగా ఉంది'' అని ఊరుకున్నా డాయన. మళ్ళీ ఉన్నట్టుండి ఆయనే" ఆ ఎదురు కుండా చూశావా" అన్నారు నేను ఆత్రుతతో వెదికాను. ఆవిడకనపబడు తుందేమో ఆబస్సు గుంపులోను ఈ రహస్యం కొంచెం తేలుతుందేమోనని "అక్కడ కాదు జనంలో, వాళ్ళ తలల మీంచి చూడు. ఎమని రాసుంది " అన్నాడాయన. బస్సురేట్లు, రాకపోకల టైములూ కాక ఒక చోట "పొగ గరాదు, బస్సులోపల ఉమ్మి వేయరాదు" అని ఉంది? ఏ ముందందులో విశేషం? అన్నాను.

అంటూనే ఆ పక్కనే ఉన్న "హరేరామ హరేరామ హరేకృష్ణ హరేహరే" చూసి మెల్లగా పైకి చదివాను. ఆయన " ఆపేశావేం మిగిలింది కూడా చదువూ " అన్నాడు. " ఇంకేముంది అక్కడ ఆడ వాళ్ళ సీటుమీద 'స్త్రీలు' అనిరాసుంది." అన్నాను. "అదేనోయ్ అమాటే నేనంటూంట. అరాసిన వాడికీ రాయించిన వాడికి తెలిసి రాశారండానికి వీలుగాని మహాపరమ సత్యాన్ని సింపుల్‌గా చెప్పారయ్యావాళ్ళు ఇందులో ఎంతర్థం ఉందనీ" అన్నాడు. నాకేం అర్థం కనబళ్ళేదు అయనింక వివరించనూ లేదు.

ఒకనాడు ఎవరో పెద్దవాడు స్వర్గారోహణంచేసిన సందర్భంలో ఆఫీసులు త్వరగామూసేశారు నాలుగ్గంటల బస్సుకే వచ్చానునేను. ఆయనా కలిశాడు. ఆవిడా వచ్చింది బస్సులో. బస్సులోవచ్చింది అన్న విషయం కూడా గమనించక ముందే ఆవిడ వచ్చిన సంగతి గమనించాం ఇద్దరం కూడాను. అయితే నేనుకూడా చూస్తున్నానన్న సంగతి ఆయనకి తెలియదని నేనను కున్నాను. మేమిద్దరం ఆ బస్సు తప్పితే కొంపమునిగి పోతుందన్నంత ప్రయత్నం మీద ఎలాగో బస్సులో చేరాం. అందులోనే ఖాళీచేసుకుని కొంచెం ముందుకి వెళ్ళాం ఆవిడ కనబడేందుకని ఆవిడ బైటికి చూస్తూకూర్చుంది. రావుగారు మొహం బాధగా పెట్టుకుని సూటిగా కాకుండా అప్పుడప్పుడు ఆవిడకేసి చూస్తూవించున్నారు నాతో ఏమీమాట్లాడ కుండాను. బస్సుఎలక్ట్రిసిటీ ఆఫీసుదగ్గర ఆగింది. కొందరు దిగారు. చాలా మంది ఎక్కారు. వాళ్ళలో ఒకఅబ్బాయికేసి ఆయన తేరిపార చూస్తూ ఉండటం గమనించాను. ఆ అబ్బాయికి ఇరవై ఏళ్ళలోపే ఉంటాయి తెల్లటి చొక్కా కాళ్ళకి అతుక్కుని ఉండే నల్లపేంటూ వేసుకుని సన్నటి బెల్టు పెట్టుకున్నాడు. మొహం మామూలుగా బాగానే ఉన్నా ఎర్రటి మొటిమలతో నిండిఉంది. బస్సు కదుల్తుంటే ఎవరికో బై బై చెబుతున్నాడు. రావుగారు అతనికేసి చాలాసేపు బాధగాచూడ్డం నాకు ఆశ్చర్యమేసింది ఆవిడకి. ఈ నేరోపాంటు కురాడికి. రావుగారి హరేరామ కీముడి పెట్టి కథ అల్లుకోవాలేమో దేవుడా అనుకున్నాను. కాని దేవుడు అల్లుంద అదివరకే మొదలు పెట్టినట్లుంది. వాడాకా రాకు

డానే: నేను ఆవిడకేసి తిరిగి చూశాను. ఆవిడ తీరే మారిపోయింది. మామూలుగా ఉండే నిర్లిప్త భావం మొహంలోంచి పూర్తిగా తొలగిపోయింది. ఎంతో ఆర్ద్రమైన కళ్ళతో ఆవిడ ఆ కుర్రాడికేసి చూస్తోంది. అతను కూడా ఆవిడ కేసి చూస్తూ చిరునవ్వు నవ్వుతున్నాడు ప్రపంచాన్ని ఎదుర్కొని జయించాం అన్న భావం ఆవిడ మొహంలో కనబడింది నాకళ్ళకి.

తల తిరిగినంత పనైంది నాకు. ఏమిటీ విపరీతం ఆవిడకంటే అతను ఎంత లేదన్నా పది పన్నెండేళ్ళు చిన్న అయి ఉంటాడు. రావుగారే ఆవిడలో ఏం ఆకర్షణ చూశారా అని సతమతమవుతున్న నాకు ఇది మరీ అర్థం చేసుకోలేని పరిస్థితయింది వాళ్ళిద్దరూ మట్టుకు తృప్తిగా బస్సులో కదలిపోయారు. రావుగారి హారెరాములో అయ్యోరామ కొంచెం అవగాహన అయ్యింది నాకు. అమ్మా ఆడవాళ్ళు ఎంతకేనా తెగుదురు ఈ ప్రపంచంతోటీ ఇందులో మగాళ్ళతోటీ ఏమి సంబంధం లేనట్లు కనిపించడం అంతా నాటకమేనన్నమాట. ఇంతకు ముందెన్నడూ ఈ కుర్రాడు కనపళ్ళేదు ఈవిడకృషి బహుశా ఈ మధ్యే ఫలించి ఉంటుంది. ఆవిడ ఈ కుర్రాడి కళ్ళకి రంభలా కనిపిస్తూంటుంది బహుశాను. ఏమో మందులూ మాకులూ వగైరా ఉపయోగించైనా ఉండవచ్చు ఏం చెప్పలేం. షా అందుకే అంటాడు. స్త్రీ అంటే జీవన శక్తి అనీ, ఆమె ప్రధాన లక్ష్యాన్ని సాధించుకునేందుకు ఏ మొగాడు కావాలనుకుంటే, ఆ అర్భకుడు. హిమాలయాల కెళ్ళినా, వింధ్యారణ్యాలు పట్టినా, కాశ్మీరంలో యుద్ధ విరమణ రేఖ కవతల దాక్కున్నా. ఎక్కడున్నా దొరక్కతప్పదు ఆవిడకి.

ఆ తరవాతనించీ రోజూ ఆఫీసుకి వెళ్ళేప్పుడు బస్సులో వాళ్ళిద్దరూ ఒకేచోటకూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వచ్చేవాడు. అయితే ఎప్పుడూ విరగబడి నవ్వుకుంటూ కేరింతలు కొట్టుకుంటూ, వెళ్ళడం చూళ్ళేదు. మెల్లిగా సీరియస్‌గా అవసర విషయాలు మాట్లాడుకున్నట్లుండేది. అతనేదేనా ఎక్కువగా మాట్లాడబోయినా ఆవిడ వారిస్తున్నట్లుండేది. సహజమే అనుకున్నాను. అదివయసు వార తారుమారైన ప్రేమ ఎంత బరితెగించినా దీని పర్యవసానమేమిటోనని బెదురుగా ఉంటుంది కదా! అయితే ఇందులో విశేషమేమంటే మధ్య మధ్య ఆ కుర్రాడు మొదటిరోజున బైబై చెప్పిన అమ్మాయి కనిపిస్తే ఆ అమ్మాయితోనే సరదాగా కబుర్లు చెబుతూ ఉండేవాడు. ఆవిడ అందుకు బాధపడుతున్నట్లుగాని అసూయచెందినట్లుగాని కనబళ్ళేదు. రావుగారు మాత్రం బొత్తిగా అన్యాయంగా తయారయ్యారు. ఆయన నవ్వులూ, వెదజల్లే అభిప్రాయాలూ లేక బస్సు చిన్నబోయినట్లుంది. ఈయన కమిటీ విషయంలో ఇంత అసూయ అనిపించేది నాకు. అవును అప్పటి ఆయనపరిస్థితిసరిగ్గా ప్రేమికుడి అసూయ వల్ల కలిగేదే అని ఎవరికైనా అనిపిస్తుంది. అన్ని అసందర్భాలూ ఓపోటేచేయి. వాళ్ళు ముగ్గురూ కూడా వాళ్ళ వయస్సుకి పరిస్థితికీ తగనట్లు ( ఇది నా సొంత అభిప్రాయమే లెండి ) ప్రవర్తిస్తూ ఉంటే అప్పటికింకా స్త్రీ అంటే స్వయంగా అనుభవం లేని నేను నా పుస్తక పఠనా జనిత మిడిమిడి జ్ఞానంతో వాళ్ళ మానసిక పరిధుల్ని కొలవడానికి పరీక్ష చేయ్యడానికి ప్రయత్నం చేశాను. నేనేదో మనస్తత్వ శాస్త్రవేత్తనని ఒక అహంకారం మిగిలి ఉండేది అప్పటికింకాను. అయితే అప్పటికింకా వాళ్ళతో పరిచయం పూర్తిగా కానందువల్ల ముందు రావుగారి విషయంలో ఇదివరకటి నాలోపం సరిదిద్దుకుందామని ముందు ప్రయత్నం చేశాను. ఓనాడు ఆయనతో బస్సులో వస్తూ " ఇవాళ మీ ఇంటికొస్తానండీ " అన్నాను. ఆయన ఇబ్బందిగా "ఇవాళా" అన్నారు. దాంతోటి సగంతగ్గి "ఇవాళే అని పట్టింపేం లేదు లెండి చాలారోజుల్నించి అనుకుంటున్నాం గదా! లేపోతే ఓసారి మీరే మా రూముకి రండి" అన్నాను. "అలాగే వస్తాలే. ఇవాళ కొంచెం పనుంది పైదాకా వెళ్ళాలి" అన్నారు. అన్నట్లుగానే ఆవేళ ఆయన స్టాపులో దిగలేదు. నేను దిగేటప్పుడు కూడా బస్సులోనే ఉండిపోయారు. సరేనాకంటే ముందు ఈయనే రంగంలోకి ఉరికారు కాబోలనుకున్నాను.

తరువాత రెండురోజులాయిన బస్సులో కనబళ్ళేదు. మర్నాడాది వారం. ఏమీ తోచక పత్రిక వార ఫలాలు చూస్తూ మడత మంచం మీదదొర్లుతుంటే ఆయన వచ్చారు. రూము వెతుక్కుని ముఖమంతా కందగడ్డ లాగుంది. రెండుమూడు చోట్ల బ్లేడు తెగ్గి

గాట్లు కూడా కనబడుతున్నాయి. ఆయనా ముఖంలో ఈ మధ్య చూసిన కంటే కళ కనబడింది. వస్తూనే అత్రాష్టుడు పెళ్ళిచేసుకుంటాట్ట. మావగారు పైచదువు చెప్పిస్తార్ట. వాళ్ళింట్లోనే ఉంటాట్ట" అన్నారు ఎవరా త్రాష్టుడు ఏమాకథ అన్నాను తాపీగా. ("నీకు ఏం తెలియనట్లు నన్ను) దబాయించకు. నువ్వు రోజూ చూస్తూనే ఉన్నావుగా నేచెప్పేది. ఆవిడ తమ్ముడి మాట."

"అతనెప్పుడూ ప్రవేశించాడు రంగంలోకి" ఆవిడతో రోజూ రాడంలా, అతగాడు ఆవిడ తమ్ముడేనట (ఈసారి నేను మంచంమీంచ ఒకమాటగా ఎగిరిలేచి కూర్చున్నాను ). ఇప్పుడు తను పెద్దాణ్ణయ్యాను కదా అని పెళ్ళిచేసుకుని పేరంటం వెడుతున్నాడు" అన్నాడాయన.

"అది సహజమే కదూ, బాదెందుకు ?"

బాధకాదుటోయ్. ఆవిడంటే ఏం సామాన్యమనుకున్నావేమిటి. ఈమూడు రోజుల్లోనూ అన్ని ఆరాలు తీశానులే. తల్లిదండ్రులు ఆవిడికి పెళ్ళవకుండానే పోయారాట. అప్పటికి మెట్రిక్యులేషన్ పేసయిఉంది, ఒకతమ్ముడు చెల్లెలుఉన్నారు. చిన్నపిల్లలు. ఆపిల్లల్ని వృద్ధిలోకి తీసుకురాటంకోసం పాపం ఆవిడను కోరి చేసుకుంటానని వచ్చిన ప్రేమికుణ్ని తిరస్కరించిందట. చిన్నఉద్యోగంలోచేరి కష్టపడి తమ్ముడికీ చెల్లెలికీ చదువుచెప్పించిపైకితీవుకొచ్చిందట. చెల్లెలికిపెళ్లి కూడా చేసి అత్తారింటికి పంపించింది. ఇప్పుడు తమ్ముడు ప్రయోజకుడయ్యాడు. వాడుకూడా సంపాయిస్తే ఇంక కొంతకాలం సుఖంగా ఉండొచ్చు. అనుకుంటూందట: పాపం! ఆవిడఇంతవరకూకడుపునిండా అన్నంతిని ఒకమంచి చీరకట్టుకునే ఎరుగదుట. ఇంతలో చెప్పాను గదూ! అత్రాష్టుడు ఆ బయి బయి అమ్మాయిని తీసుకొచ్చి పెళ్లి చేసుకుంటున్నాను. ఉద్యోగం మానేస్తున్నాను అన్నాట్ట. మరి నాగతేమిట్రా అంటే నీకేం ఉద్యోగం చేస్తున్నావు ఎవరి పోరూ లేకుండా సుఖంగా ఉండూ "అన్నాట్ట."

"ఈ సంగతు లన్నీ ఎలా తెలిశాయి మీకు"

"చాలామటుకు వాళ్ళపని మనిషి చెప్పింది"

కొంచెం సేపు పస్తాయించి ఆయన కళ్ళలోకి చూస్తూనే అన్నాను నేను, "పోనీ ఇదీ ఒకందుకు మంచిదే ఇంకమీరు నిరాఘాటంగా ప్రయత్నం చెయ్యొచ్చు. ఆవిణ్ణి ఉద్ధరించినట్టూ ఉంటుంది."

ఆయన నిర్ఘాంత పోయాడు, "నేనా, అదేమిటోయ్ అలా గంటావ్, పెళ్ళాం బిడ్డలు కలవాణ్ణి పెద్దవాణ్నయ్యాను" అన్నాడు,

ఈ సారి నిర్ఘాంత పోవడం నావంతయింది. మరి ఇన్నాళ్ళూ ఈయన ప్రవర్తన వెనకున్న మానసిక ప్రవృత్తికి నిర్వచన మేమిటో నా కిప్పటికీ అంతు చిక్కలేదు